క్లుప్తంగా

బార్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

అచ్చంపేట రూరల్: అచ్చంపేట న్యాయవాదుల బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా శ్రీధర్‌రావు ఎన్నికయ్యారు. సోమవారం పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారి వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, ఉపాధ్యక్షుడిగా కౌసర్‌ను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కోడేరు: మండలంలోని బావాయిపల్లికి చెందిన దేవరపాగ రాకేష్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఎస్వీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎన్వీ ఫౌండేషన్ చైర్మన్ నక్క వేణుగోపాల్‌యాదవ్ బాధితుడిని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

తెలకపల్లి: మండల పరిధిలోని ఆలేరులో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించారు. గ్రామంలోని పబ్బతి ఆంజనేయ స్వామి, శివాలయం ఎదుట వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభాన్ని వేద మంత్రాలతో ప్రతిష్ఠించారు. 26న యాగంతో ప్రారంభించి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి బంధువులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థిని వేధించిన యువకుడికి దేహశుద్ధి

అచ్చంపేట రూరల్: ఓ విద్యార్థిని వేధించిన యువకుడిని మరికొంత మంది యువకులు దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యువకుడిని కొట్టిన వీడియో సోషల్‌మీడియాలో వైరలవుతోంది. ఫోన్‌లో విద్యార్థిని ఫోటోలు తీసి వేధిస్తున్నట్లు తెలిసిన యువకులకు విద్యార్థిని చెప్పడంతో సదురు యువకుడిని వెతికి పట్టుకున్నారు. సెల్‌ఫోన్‌లో ఉన్న ఫోటోలను డిలీట్ చేయించారు. యువకుడికి ముఖంపై గాయాలైనట్లు వీడియోలో కన్పించింది. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

స్థల ఏర్పాట్ల పరిశీలన

కల్వకుర్తిరూరల్: మండలంలోని వేపూరులో ఈనెల 29న బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సోమవారం మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, వైస్ ఎంపీపీ గోవర్ధన్, తదితరులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సమ్మేళనానికి వచ్చే కార్యకర్తలు, నాయకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు వైస్ ఎంపీపీ గోవర్ధన్ చెప్పారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ బాలయ్య, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంగయ్య పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

అచ్చంపేట రూరల్: స్థానిక మున్సిపాలిటీలో అవినీతి జరిగిందని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అనడం సరైంది కాదని, అవినీతిని నిరూపించాలని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ సవాల్ విసిరారు. సోమవారం అచ్చంపేట ఆర్ అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై బురద జల్లడం, అసత్య ఆరోపణలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, కౌన్సిలర్లు అంతటి శివ, తగురం శ్రీనివాసులు, రమేష్‌రావు, సోమ్ల, మనోహర్‌ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సోమశిలలో నూతనంగా నిర్మాణం చేసిన సీతారామాలయంలో స్వామి వారి విగ్రహాలను భక్తుల సమక్షంలో వేదపండితులు ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా స్వామి వారికి మూలమంత్ర హోమం, నిర్వహించారు. స్వామి వారికి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్‌ఐసీలో జిల్లా విద్యార్థుల ప్రతిభ

కందనూలు: ఎన్‌ఐసీ క్యాంపులో పాలమూర్ యూనివర్సిటీ తరుపున పాల్గొన్న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాలమురు యూనివర్సిటీ నుంచి ఎన్‌ఐసీ క్యాంప్‌లో 8 మంది విద్యార్థులు బెంగుళూర్‌లోని సిటీ యూనివర్సిటీ బెంగళూరులో 7 రోజులు పాల్గొన్నారు. ఎన్‌ఐసీ క్యాంపులో 6 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా, రాష్ట్రం నుంచి పాలమూరు యూనివర్సిటీ విద్యార్థులు 4 పథకాలు సాధించి సత్తా చాటారు. సోలో సింగింగ్, డ్రామాలో ప్రథమ, గ్రూప్–డీ, గ్రూప్ సింగింగ్‌లో తృతీయ బహుమతులు సాధించారు.

టాలెంట్ టెస్ట్‌లో 'లిటిల్‌బర్డ్' ప్రతిభ

పెద్దకొత్తపల్లి: చుక్క లక్ష్మీబాయమ్మ తెలంగాణ టాలెంట్ టెస్ట్‌లో లిటిల్‌బర్డ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ మేరకు నిహ రెండవ ర్యాంకు, జశ్వంత్ 9వ ర్యాంకు సాధించినట్లు కరస్పాండెంట్ రఘుపతిరెడ్డి తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ చుక్క లక్ష్మీబాయమ్మ నిర్వాహకులు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ సర్టిఫికెట్లతోపాటు మెమెంటో అందజేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులను పాఠశాల యాజమాన్యం కరుణాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రితిరాజు సన్మానించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



పెద్దాపూర్‌లో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శ్రీమతి

తెలకపల్లి: చిరుధాన్యాలతో పోషక విలువలు లభిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేకే రెడ్డి ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలు ఉన్న చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. పోషణ పక్షంలో భాగంగా నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థులకు రక్త హీనతపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల్లో ఉండే ఐరన్‌పై విద్యార్థులకు వివరించారు. రాగి, కొర్రలు, అండుకొర్రల్లో చాలా పోషకాలు ఉంటాయన్నారు. అనంతరం చిరుధాన్యాలపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రభాకరాచారి, అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ, అక్బరీ, రాధ, రాంచంద్రమ్మ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల పరిధిలోని పెద్దాపూర్, బొల్లంపల్లిలలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్రీమతి మాట్లాడుతూ పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్య లభిస్తుందన్నారు. అలాగే కిశోర బాలికలు చిరుధాన్యాలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషక పదార్థాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీనివాసులు, అపర్ణ, సూపర్‌వైజర్ జ్యోతి, ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు రాములమ్మ, కౌసల్య, విజయ, శారద, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఉప్పునుంతల: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ పక్షం కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీపాష కోరారు. సోమవారం తహసీల్దార్ శైలేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన మండల స్థాయి ప్రజావాణిలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణిలో ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సరస్వతి, ఎమ్మార్వై రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కల్వకుర్తి టౌన్: ఆపద సమయంలో ఉపయోగపడే ప్రథమచికిత్స నైపుణ్యాలను అందరూ తెలుసుకోవాలని రోడ్‌సేఫ్టీ విభాగం డీఎస్పీ శివధర్ రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని మాడల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రథమచికిత్స నైపుణ్యాలపై ఈఎంఆర్‌ఐ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రస్తుతం చాలామంది గుండెపోటుతో చనిపోతున్నారని కల్వకుర్తి డీఎస్పీ గిరిబాబు గుర్తు చేశారు. అందుకు గాను ఆ సమయంలో వారికి సీపీఆర్ అందిస్తే బతికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. ప్రథమచికిత్సలో భాగంగా క్రియాశీల రక్తస్రావణ నియంత్రణ, సీపీఆర్, దృశ్యరక్షణ లాంటి మొదలైన ప్రథమచికిత్స నైపుణ్యాలను ఈఎంఆర్‌ఐ ఇన్‌స్ట్రక్టర్ డా. సతీష్ వీడియోల ద్వారా విద్యార్థులతో పాటు డివిజన్ పరిధిలోని పోలీసులు, పెట్రోల్ బంకులు, దాబాలు, రెస్టారెంట్లు, దుకాణాలు, సెక్యూరిటీ గార్డులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ సైదులు, ఎస్‌ఐలు రమేష్, లక్ష్మణ్ నాయక్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

తాడూరు: హరితహారంలో భాగంగా ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఎంపీడీఓ గంగామోహన్ తెలిపారు. సోమవారం మండలంలోని ఇంద్రకల్, లక్కిరాంతండా, గ్రామపంచాయతీలలోని నర్సరీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నర్సరీల నిర్వాహకులకు మొక్కల పెంపకం, వాటి ఎదుగుదల కోసం అవసరమైన నీరు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న కారణంగా మొక్కలు ఎండిపోకుండ ప్రతి రోజు నీటిని అందించాలన్నారు. మొక్కలను సంరక్షించే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట ఉపాధిహామీ ఏపీఓ ప్రవీన్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఉన్నారు.

రూ.5 భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలి

కందనూలు: రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థలు, రాష్ట్ర పురపాలక శాఖ పరిధిలో నిర్వహిస్తున్న అన్నపూర్ణ పథకం ద్వారా రూ.5కే భోజన సదుపాయాన్ని జిల్లా కేంద్రంలో కూడా ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో మాజీ సైనికుడు డి.వెంకటయ్య విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ యార్డులలో, రైతు బజారు ప్రాంతాలలో అన్నపూర్ణ పథకం ద్వారా బీద ప్రజల ఆకలి తీర్చాలని ప్రభుత్వం భావిస్తుందని తెలిసిందన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటు తర్వాత పలు ప్రభుత్వ కార్యలయాలకు పరిసర గ్రామాల ప్రజలు, మార్కెట్ యార్డ్ వ్యవహారాల కోసం రైతులు, చాలా మంది పేదలు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయం, ప్రభుత్వ ఆఫీసులకు జిల్లా కేంద్రానికి ప్రతి నిత్యం వస్తున్నారన్నారు. వీరందరూ ఆకలి తీర్చుకొనేందుకు హోటల్‌లలో సుమారుగా రూ.80 నుంచి రూ.100 వరకు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. కావున రూ.5 భోజనం తక్కువ ధరతో బస్టాండ్, మార్కెట్ యార్డ్, రైతు బజార్ తదితర రద్దీ ప్రాంతాలలో పంపిణీ చేస్తే రైతులకు, విద్యార్థుల ఆకలి తీరుతుందన్నారు. జిల్లా అధికారులు స్పందించి పట్టణ ప్రధాన కూడళ్లలో రూ.5 భోజనం సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

చారకొండ: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని సాయితిరుమల గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనానికి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, ఎంపీపీ నిర్మల విజేందర్ గౌడ్ హాజరవుతారన్నారు. కావున మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

రేపు 'చలో హైదరాబాద్'

కందనూలు: టీడీపీ 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 29వ తేదిన చలో హైదరాబాద్ కార్యక్రమం చేడుతున్నట్లు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రమేష్ కొప్పుల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు టీడీపీ ఆధ్వర్యంలో పార్టీ ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఈ సభకు జాతీయ పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, అచ్చంనాయుడులతో పాటు పలువురు హాజరవుతారని అన్నారు.

కల్వకుర్తిరూరల్: టీడీపీ ఆవిర్భావ వేడుకలను ఈ నెల 29న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ యాదిలాల్ తెలిపారు. కార్యక్రమంలో మల్లయ్య, వేణు, భాస్కర్, కుమార్ పాల్గొన్నారు.

విగ్రహం దిమ్మెను కూల్చడంపై ఆందోళన



ధర్నా నిర్వహిస్తున్న నిరసన కారులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండల పరిధిలోని తూడుకుర్తిలో బుద్ధ విగ్రహం ఏర్పాటు కోసం నిర్మించిన దిమ్మెను ఆదివారం జేసీబీతో కూల్చడంతో బీఎస్పీ, అంబేద్కర్ యువజన సంఘం కార్యకర్తలు సోమవారం ధర్నాకు దిగారు. గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై భైఠాయించి బాధ్యులను శిక్షించాలని, కూల్చిన వారే దిమ్మెను ఏర్పాటు చేయాలని నినాదించారు. ఉదయం 11 గంటలకు రోడ్డుపై భైఠాయించిన నిర్వాహకులు సాయంత్రం వరకు రాస్తారోకో నుంచి నిష్క్రమించకపోవడంతో పోలీసులు అక్కడికి చేరుకుని సముదాయించారు. అనంతరం ఎస్‌ఐ విజయ్‌కుమార్ అక్కడికి చేరుకుని వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా శాంతి యుతంగా ధర్నా నిర్వహించుకోవాలని, ధర్నాను ఇక్కడి నుంచి మర్రి చెట్టువద్ద ఏర్పాటు చేసుకున్న టెంటు వద్దకు మార్చుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ నడిబొడ్డున గల మర్రి చెట్టువద్ద ఏర్పాటు చేసుకున్న టెంటులో వద్ద ధర్నా కొనసాగించారు.

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి

కందనూలు: నూతనంగా ఏర్పాటు చేసిన పదోతరగతి మూల్యాంకన కేంద్రానికి అన్ని వసతులు కల్పించాలని పీఆర్టీయూ అధ్యక్షుడు సూర్య శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో డీఈఓ గోవిందరాజులును కలిసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల మూల్యాంకన కేంద్రం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడంతో ఉపాధ్యాయులకు మహబూబ్‌నగర్ వెళ్లే బాధలు తీరుతాయని చెప్పారు. నూతన మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని వసతులు కల్పించాలని, ప్రస్తుతం గర్భిణి మహిళా ఉపాధ్యాయులు, చంటి పిల్లల ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని డీఈఓను కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్ రావు, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, తహర్ పాష, శ్యాంసుందర్ గౌడ్ పురుషోత్తం మంతటి శ్రీనివాస్ నారాయణ కంచర్ల శివప్రసాద్, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తాడూరు: ఐకేపీ కార్యాలయంలో వీఓఏలుగా విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వచ్చే నెల 2 నుంచి సమ్మెలో పాల్గొంటున్నట్లు ఏపీఎం తిరుపతయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఓఏల మండల నాయకుడు వెంకటస్వామి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి గ్రామసంఘాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నామని తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. రూ.26 వేల వేతనం ఇవ్వాలని కోరారు. ఆయా గ్రామాల వీఓఏలు లక్ష్మి, లక్ష్మణ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

తిలక్‌నగర్‌కాలనీలో చోరీ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీలో నివాసముండే మాజీ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి శనివారం బంధువుల వద్దకు హైదరాబాద్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. సోమవారం చుట్టు ప్రక్కల వారు ఇంటి తలుపును తెరచి ఉండటం చూసి వారికి ఫోన్‌చేయగా..హైదరాబాద్‌లో ఉన్నామని చెప్పడంతో ఇంట్లో చోరీ జరిగిందని స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి ఇంట్లోకి వెళ్లగా బీరువాలో ఉన్న వస్తువులు, బట్టలు చిందర వందరగా పడిఉన్నాయి. ఈ విషయమై ఎస్‌ఐ రమేష్‌ను వివరణ కోరగా యజమానుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు మేలు



బైరాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు

వెల్దండ: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ పథకాలతోపాటు మేలు జరిగిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని బైరాపూర్‌లో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, తదితర పథకాలతో ఎంతో మందికి మేలు జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరారు. అనంతరం ఇంటింటి కాంగ్రెస్ ప్రచారం చేశారు. కార్యక్రమంలో పర్వత్‌రెడ్డి, పుల్లయ్య, మధుసూదన్‌రెడ్డి, శేఖర్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటయ్య, అల్లాజీ, రామస్వామి, రమేష్, సురేష్, కృష్ణయ్య, జంగయ్య, ఈదమయ్య, పెద్దయ్య, కార్తిక్, శ్రీకాంత్, భగవంత్ తదితరులు ఉన్నారు.

'ప్రజావాణి'కి రెండు వినతులు

పెద్దకొత్తపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఈ సమావేశానికి డిప్యూటీ తహసీల్దార్ విష్ణువర్ధన్ రావు, ఏఓ రమేష్‌నాయక్, ఏపీఎం అరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగమ్మ హాజరయ్యారు. మిగతా శాఖ అధికారులు హాజరుకాలేదన్నారు. ప్రజావాణికి రెండు దరఖాస్తులు వచ్చాయన్నారు.

సన్మానం

తెలకపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ సోమవారం బదిలీపై అమ్రాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి ఎమ్మార్‌ఐగా బదిలీ అయ్యారు. ఈ మేరకు తహసీల్దార్ తబితా రాణి, నయాబ్ తహసీల్దార్ లక్ష్మణ్, గిర్దావర్ రామస్వామి తదితరులు శాలువా, పూలమాలలతో సన్మానించారు.

పశువులను సంరక్షించుకోవాలి



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ నాగరాజు యాదవ్

తెలకపల్లి: పశువులను సంరక్షించుకోవాలని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు అన్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా ప్రత్యేక శిబిరంలో సోమవారం 4వ రోజు మండలంలోని పెద్దూరులో పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశుగర్భకోశ వ్యాధులకు, చర్మవ్యాధులు, ఆకలి మందగించడం వంటి తదితర వ్యాధులకు పశువైద్యాకారి డాక్టర్ నాగరాజు యాదవ్‌తో చికిత్స చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు చికిత్సతో పాటు ఆరోగ్యంగా ఉంచుకోవాలని కాపరులకు సూచించారు. అదే విధంగా చిరుధాన్యాల సాగు ద్వార రైతులకు ఆదాయం పెరుగుతుందని, ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

దరఖాస్తు గడువు పెంచాలి

కల్వకుర్తిరూరల్: మున్సిపాలిటీలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని, దరఖాస్తు గడువును పెంచాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు సోమవారం డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు మాటల గారడీతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అర్హులైన పేద ప్రజలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించడంతో పాటు ఖాళీ స్థలాలు ఉన్న వారికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, రవిగౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కు ఇస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: మండల పరిధిలోని పెద్దాపూర్‌కి చెందిన పద్మకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.19వేల చెక్కును సోమవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అందజేశారు. కేసీఆర్ పేదలకు నాణ్యమైన వైద్యం చేయించుకోవడానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్‌ముదిరాజ్, కృష్ణ, చంద్రశేఖర్, రాములుయాదవ్, శ్రీశైలం, యాదయ్య ఉన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

లింగాల: వేసవిలో నిర్వహించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గీతాంజలి సూచించారు. మండల పరిధిలోని అవుసలికుంట, దారారం, కొత్తకుంటపల్లిలలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఎంపీడీఓ పర్యవేక్షించారు. రాళ్లు, చెట్ల పొదలు తొలగింపు, కుంటలలో ఒండ్రుమట్టి తీసే పనులు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. జాబ్ కార్డు ఉన్న వారందరూ పనులకు వెళ్లాలని ఆమె సూచించారు. అలాగే పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పనులను పరిశీలించాలని ఆదేశించారు.

ఆలయ అభివృద్ధికి రూ. 75వేల విరాళం



వెల్దండ: మండలంలోని గాన్‌గట్టుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని బద్రిగానితండాలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి సోమవారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.75వేల ఆర్థిక సాయం అందజేశారు. తండాలో హన్‌మాన్ దేవాలయ నిర్మాణానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి రూ.1.50లక్షల విరాళం అందిస్తామని హామీ ఇవ్వడంతో మొదట రూ.75వేలు అందజేశారు. ఇందులో భాగంగా రెండో విడతలో రూ.75వేల ఆర్థిక సహాయం అందిస్తామని ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు వరప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలకు అండగా ఉండి సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తరుణ్, చందు, నరసింహ, లక్ష్య, గన్య తదితరులు ఉన్నారు.

జనచైతన్య పోస్టర్ల ఆవిష్కరణ



జూపల్లిలో జనచైతన్య పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో జనచైతన్య బస్సు యాత్రలను కొనసాగిస్తున్నామని ఆ పార్టీ మండల కార్యదర్శి జి.అశోక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం బొందలపల్లిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకిక తత్వాన్ని నరేంద్రమోదీ ప్రభుత్వం నాశనం చేస్తున్నారని, మతోన్మాదం పేరుతో ప్రజలను విడదీస్తూ పాలిస్తున్నారని, అవినీతి పెరిగిందని, అవినీతి పరులకు, పెట్టుబడిదారులకు దేశ సంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు. మంగళవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ బస్టాండ్ సర్కిల్‌లో నిర్వహించే జనచైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుభాస్, కుర్మయ్య, సురేశ్, నాగరాజు, కృష్ణయ్య, పరుశరాములు పాల్గొన్నారు.

చారకొండ: బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్య యాత్రలో భాగస్వాములు కావాలని సీపీఎం జిల్లా నాయకులు బి. బాలస్వామి అన్నారు. మండలంలోని జూపల్లిలో సోమవారం జనచైతన్య యాత్ర పోస్టర్ హమాలీలు, కార్మికులతో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు, శేఖర్, లక్ష్మయ్య, మల్లేష్, కార్మికులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు నిర్వహిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తిరూరల్: మండలంలోని ఎల్లికల్‌తండాలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లికల్ ఆంజనేయ దేవాలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్య, వైద్యం, ఉపాధితో పాటు ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నట్లు సుంకిరెడ్డి తెలిపారు. అనంతరం తండా వాసులకు మంచినీరు అందించేందుకు రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు నర్సింహారెడ్డి, ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నిర్మల

వెల్దండ: మండల పరిధిలోని అజిలాపూర్, రాచూర్, పోతేపల్లి, తాండ్ర పాఠశాలల్లో విద్యార్థులకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్‌లను తలకొండపల్లి ఎంపీపీ నిర్మల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అజిలాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. విద్యార్థులకు ఉప్పల ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్ సహకారంతో పేద విద్యార్థులకు అండగా ఉంటున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా దుస్తులు, నోట్ పుస్తకాలు అందజేస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రీశైలంగౌడ్, చిత్తరంజన్‌దాస్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

పంచాయతీలకు జిల్లాస్థాయి అవార్డులు

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి, సూరాపూర్ గ్రామ పంచాయతీలకు జిల్లా స్థాయి అవార్డులు దక్కాయి. గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రభుత్వ నిర్ధేశించిన 9 అంశాలలో ఆయా పంచాయతీలు ముందంజలో ఉండడంతో అవార్డులు దక్కించుకున్నాయి. సోమవారం ఆయా పంచాయతీల సర్పంచ్‌లు నాగ రవిశంకర్, లక్ష్మమ్మ, కార్యదర్శులు వెంకటేష్, లక్ష్మి అధికారులచే ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందుకున్నారు.

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సోమశిలకి క్లీన్, గ్రీన్ కార్యక్రమంలో భాగంగా జాతీయ పంచాయతీ అవార్డు రావడంతో కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ మను చౌదరి ఆధ్వర్యంలో సర్పంచ్ మద్దిలేటి కి అందజేశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా స్థాయి అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి ఉన్నత అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చారకొండ: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాల అమలులో ప్రగతి సాధించిన గ్రామాలకు జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి సతత్ వికాస్ పురస్కార్ అవార్డులను అందజేశారు. ఈ మేరకు మండలంలోని నిజాపల్లి, గోకారం, చంద్రాయన్‌పల్లి, శేరిఅప్పారెడ్డిపలి గ్రామాల సర్పంచ్‌లు మల్లీశ్వరి, మాధవి, వసంత, రంగారెడ్డి, రవీందర్‌రెడ్డిలకు అడిషనల్ కలెక్టర్ మనుచౌదరి, జెడ్పీ చైర్మన్ శాంతకుమారి, జెడ్పీ సీఈఓ ఉషలు అవార్డులు అందజేశారు.

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు సరికాదు

డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ



అచ్చంపేట దీక్షలో కూర్చున్న డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడం దుర్మార్గమని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం బస్టాండ్ సమీపంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఒక్క రోజు దీక్షను నిర్వహించారు. ఈ మేరకు నాయకులతో కలిసి నల్ల కండువాలు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనర్హత వేటు వేయడం కక్ష సాధింపు చర్యనేనన్నారు. రాహుల్‌గాంధీని చూసి మోదీ భయ పడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న భారత్ జోడోతో రాహుల్ గాంధీకి మంచి పేరు వచ్చిందన్నారు. ఆదరణ చూసి ఓర్వలేక ఇటువంటి చర్యలకు పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు అనంత రెడ్డి, కాశన్నయాదవ్, రఘురాం, కపిలవాయి శేఖర్, గోపాల్‌రెడ్డి, గౌరీశంకర్, ఛత్రునాయక్, వెంకటరెడ్డి, రేణయ్య పాల్గొన్నారు.